



వట్లూరు శివప్రసాదరావు

# పంజరం

వెంటిలేటరు నుండి దూసుకొస్తున్న సూర్యుని లేత ఎరుపుకిరణాలు మెల్లగా తిరుగుతున్న ఫేనురెక్కల మీద పడి మెల్లగా పరావర్తనం చెంది గదిలో వింతగా మెరుస్తుంటే.కుషన్ పరుపుమీద వెల్లకిలా పడుకొని ఆసక్తిగా గమనిస్తున్నాడు రాజారావు.

కొద్ది నిమిషాల అనంతరం సూర్య కిరణాల కోణం మారడంతో మసక కాంతి కొంత గదిలో అలుముకొంది.

బెడ్ మీద ఎంతో సేపట్నుండి పడుకొని ఉండటంవలన విసుగనిపించి లేచి కిటికీ దగ్గరగా నడిచి కుషన్ కుర్చీలో కూర్చున్నాడు.

అస్తమిస్తున్న ఎర్రటి సూర్యబింబం పశ్చిమాద్రి నుదుటిపై అద్దిన ఎర్రటి కుంకుమబొట్టులా వుంది. క్రమేపి కుచించుకుపోతున్న సూర్యుణ్ని, ఎర్రని రంగు చిలికినట్లున్న పశ్చిమ ఆకాశాన్ని తదేకంగా గమనిస్తుండిపోయాడు.

అప్పుడే అస్తమించిన సూర్య కిరణాలు కుంచల్లా మబ్బుతునకల్ని తాకి ఆకాశపు కాన్వాసుపై వివిధ రంగుల్లో అద్భుత దృశ్యాల్ని చిత్రిస్తుంటే పరవశం కలిగించింది. అస్తమించినా తన కిరణ ప్రభావంలో ప్రకృతిని శోభాయమానంగా తీర్చిదిద్దుతున్న సూర్యుడు ఎంత గొప్పవాడు?

రాజారావు ప్రశ్నించుకొన్నాడు.

తన అస్తమయానికి ఇంతటి శోభ ఎలా చేకూరుతుంది? చల్లని గాలికి మంచుబిందువులా మారి వేడికి కరిగిపోయే నీటిచుక్కకు స్థిరత్వం ఎక్కడుంది? సూర్యకిరణం తాకగానే కరిగే మంచుబిందువులాంటివాడు తను. తన జీవితోదయం నుండి నేటివరకు తనెవరికి ఉపయోగపడ్డాడు?

భారంగా నిట్టూర్చాడు.

చంద్రుడు సూర్యకిరణాల ఉనికితో ప్రభావితుడై ఎలా ప్రకాశిస్తాడో

ముప్ఫయిసంవత్సరాల తర్వాత తెలిసిన రాజేంద్ర ఉనికి తన హృదయాన్నంతగా ప్రభావితం చేసింది.

వారం క్రితం తను వ్రాసిన ఉత్తరం రాజేంద్రకు అందేవుంటుంది. వెంటనే వచ్చి తనను కలుసుకోమన్న అభ్యర్థన రాజేంద్ర మన్నిస్తాడా? . ఏమో? తన ఆవేదనను, దుఃఖాన్ని విప్పిచెప్పుకోవ టానికి ఇప్పుడు అతనుకాక మరెవరు ఉన్నారు ? ఎందుకనో, రాజేంద్ర తప్పక వస్తాడనే ఆశ తనకుంది.

గదిలో మెల్లగా తిరుగుతూ ఆలో చిస్తున్నాడు రాజారావు. అలా నడిచే వాడల్లా అద్దంముందు ఆగి తన ప్రతి బింబాన్ని చూసుకొన్నాడు

నున్నగా మెరుస్తున్న బట్టతలపై అక్కడక్కడా తెల్లగా నెరిచిన కొద్ది వెంట్రుకలు, కాంతిలేక లోతుకుపోయిన కళ్ళు, కాగితంలా ముడతలుపడిన చర్మం చూస్తుంటే వికారం వేసింది.

తన ప్రతిబింబాన్ని ఎక్కువసేపు చూడటానికి భయంవేసి తిరిగి కిటికీ ముందున్న కుర్చీలో కూలబడ్డాడు. 'తన జీవితంలా మసక మసకగా చీకట్లు అలుముకొంటున్నాయి,' గొణుక్కొ న్నాడు తనలో తానే.

గతం తాలూకు ప్రతిధ్వనులు మనసును తాకి ప్రశాంతతను బ్రద్దలు చేస్తుంటే, ఎదురుగా టీపాయిమీద అందంగా మెరుస్తున్న ఫోటో ఆల్బమ్ చేతిలోకి తీసుకొన్నాడు.

ఆల్బమ్‌నిండా పరుచుకొన్న తన కొడుకు మధుర జ్ఞాపకాలను నెమరువేసు కొంటూ ఒక్కోపేజీ భారంగా తిప్ప సాగేడు. ఒక్కపేజీలో అంటించబడి ఉన్న ఫోటో ఒక్కో సంఘటనను, కాలాన్ని జ్ఞప్తిచేస్తుంటే - రాజారావు మనసు మాత్రం నెగటివ్‌లా వికారానికి గురై బరువెక్కసాగింది.

ఆల్బమ్ చివరిపేజీలో రాజారావు దృష్టి నిలిచిపోయింది. ఫోటో క్రిందుగా వ్రాసిఉన్న నాలుగైదు వరుసల అక్షరాలు పదే పదే చదివాడు. వాక్యాల్లోని భావం "ఎక్స్‌పోజర్"లా మనసును తాకుతుంటే గతం ముద్రించబడసాగింది.

"డాడీ? నా పెళ్ళి విషయంలో మీరు ఇంత నిరంకుశంగా మాట్లాడటం నాకు బాధ కలిగిస్తుంది ఎలాటి వ్యక్తితో నా జీవితం పంచుకోవాలో నన్ను నిర్ణయించుకోనివ్వండి."

"నా నిర్ణయం అర్థంలేనిదంటావా ?"

"కాదన్నా. కాని నన్నూ అర్థం చేసుకోండి సరితా, నేనూ ప్రేమించు కొన్నాం. పెళ్ళి చేసుకోవాలను కొంటున్నాం."

"గోపాల్। మంత్రిగారికి అల్లుడయ్యే అవకాశం నీకు రావడం అదృష్టం. ఆయనతో వియ్యమొందితే ఆయన పలుకుబడి నుపయోగించి నువ్వు వ్యాపా రాన్ని పెంచుకోవచ్చు. జీవితాంతం

సుఖపడతావు," తను నచ్చజెప్పాలని చూశాడు.

"డాడీ! పెళ్ళంటే, రెండు విడి పోగులు బలవంతంగా పేని ఒకటిగా చెయ్యటానికి తాడు కాదు. రెండు సెలయేరులు ఒకటిలా కలిసి పారే నది లాంటిది. వ్యాపారం అంతకన్నా కాదు," స్థిరంగా చెప్పాడు.

గోపాల్ సమాధానాలకు తాను సహనం కోల్పోయాడు.

"అయితే నీ పంతం నెగ్గాలంటావ్? సరిత తండ్రి హిందూ– తల్లి హరిజన అంటున్నావ్. అయితే సరితది ఏ కులం? సరితకు మనతో సరితూగగలిగే ఆస్థివుందా? ఆమెలో ఏం చూసి ప్రేమించావు? ఏ ప్రత్యేకత లేనిదాన్ని పెళ్ళి చేసుకొంటాననటం నన్ను అవమానించటం కాదూ?" తనూ కోపంతో రెచ్చిపోయాడు.

"సారీ డాడీ! రెక్కలొచ్చిన పక్షులకు గలగలసాగే సెలయేటి చల్లదనం, ఉద్యాన వనాలలో వసంతగానం, సూర్యోదయపు అరుణరేఖలు, వెన్నెల మైదానాలు కలిగించే ఆనందం మీరు కట్టే బంగారు పంజరంలో లభించవు. సరితకు నేను మాటిచ్చాను".

"గోపాల్! అవసరం చేవదేరిన మాను అనుభవం గాలికి వంగే మొక్క. ఆత్మరక్షణకోసం గాలికి తలవంచగలిగి నిలదొక్కుకునే మొక్కే, గాలి విసురుకు తల నేలకూలే మ్రానుకన్నా గొప్పది. ఒకనాడు నేనూ నీలా ఆదర్శాలనే నమ్ముకొన్నా అనుభవాలు నాతల వాల్చాయి. అందుకే జీవితంలో నిలదొక్కుకున్నాను".

"డాడీ! మాకై మీరో పంజరాన్ని నిర్మించుకొన్నారు. చిలకపలుకుల్లా మీ అనుభవాలనే పదేపదే వర్ణిస్తున్నారే గాని, ఏనాడూ మీ రెక్కల శక్తితో ఈ విశాల ప్రపంచంలో స్వేచ్ఛగా ఎగిరి అందులోని ఆనందాన్ని పొందలేక పోయారు. మీ రెప్పుడో మా రెక్కలను నరికివేశారు," ఆవేశంగా చెప్పాడు గోపాల్.

సూటిగా ఆ మాటలు తన హృదయాన్ని నాటుకొనేసరికి ఆవేశంతో వణికిపోయాడు. పిల్లపక్షి తల్లికి ఎగరటం నేర్పా లనుకుంటుందన్న కోపంతో వళ్ళుమర్చిపోయాడు తను.

"గోపాల్! నామాట కాదనవని మంత్రిగారికి మాటిచ్చాను. త్వరలోనే ముహూర్తాలు పెట్టించబోతున్నాను నా నిర్ణయానికి ఎదురుతిరిగావో బికారిలా రోడ్లట్టుకు తిరగాల్సొస్తుంది. ఆస్థి స్వార్జితం గనక నా ఇష్టంవచ్చేలా చేసుకొనే హక్కు చట్టరీత్యా నాకుంది మైండిట్!" తను చరచరా బయటకు వెళ్ళిపోయాడు.

గదిలో ఒక్కసారిగా వెలుతురు రావడంతో గాలి విసురుకు మేఘంలా

గతం చెదిరిపోయింది. తెప్పరిల్లుకొని, లోనికి వచ్చిన నాగయ్యను చూశారు. చేతిలోవున్న అల్బమ్ టీపాయిమీద పెట్టాడు

"అయ్యగారూ! మందు తాగారా?" వినయంగా ప్రశ్నించాడు.

రాజారావు అడ్డంగా తల కదిలించాడు. నాగయ్య మందు గ్లాసులోనికి వంచి స్తే కళ్ళుమూసుకొని ఒక్కగుక్కలో మింగి ఖాళీగ్లాసు అందించాడు.

"స్నానం చేస్తారాండి?" అడిగాడు.

"చెయ్యను, ఆ షెల్ఫ్‌లో సిగరెట్ పాకెట్, లైటర్ వున్నాయి. ఇచ్చి వెళ్ళు". నల్లచీరపై జరీపువ్వుల్లా మెరుస్తున్న విద్యుద్దీపాల వెలుగును కిటికీనుండి గమనిస్తూ అన్నాడు.

షెల్ఫ్‌నుండి తీసిచ్చి నాగయ్య బయటకు నడిచాడు. రాజారావు లైటర్‌తో సిగరెట్ వెలిగించి గట్టిగా దమ్ము పీల్చాడు. దీపకాంతితో పొగ తెల్లగా అలుముకుంది.

"ఏవండీ! మీ కెందుకింత మొండి పట్టుదల? క్షేత్రాన్నిబట్టి గింజ నాటి మొక్కను పెంచాలి. కాలాన్నిబట్టి వాళ్ళ ఉద్దేశాల కనుగుణంగా వాళ్ళను ఎదగ నివ్వాలి పంతాలకుపోయి ఒక్కగా నొక్క బిడ్డను దూరం చెయ్యకండి. రెండురోజులు గోపాల్ కనిపించక పోయేసరికి కౌసల్య గుండెపగిలేలా ఏడ్చింది.

అయినా తన హృదయం కరగలేదు. గోపాల్‌ను కూడా తనున్న పంజరం లోనికే లాగాలనుకున్నాడు. వాడికున్న అదర్శాలనే రెక్కలు కత్తిరించి బంగారు పూచలమధ్య బిగించి తన పలుకునే నేర్పి పలికించాలనుకొన్నాడు.

తన కాఠిన్యానికి, కర్కశత్వానికి ఫలితం ఏమిటి? బాధగా కణతలు నొక్కుకున్నాడు కళ్ళలో నీటిపొర కదులుతుంటే అంతా మసగ్గా కనిపి స్తుంది కాలిన సిగరెట్. యాష్‌ట్రేలో కుక్కాడు.

బాధ హృదయాన్ని కోస్తుంటే ఆవేదనగా కుర్చీనుండి లేచి షెల్ఫ్‌కేసి నడిచాడు. విస్కీ. సోడా, ఖాళీగ్లాసులు తీసుకొచ్చి టీపాయిమీదపెట్టి ఎదురుగా కూర్చొన్నాడు. గ్లాసులో విస్కీ వంచు కొని షోడా కలిపి తాగుతూ మరో సిగరెట్ వెలిగించాడు.

రెండోసారి తనకు గుండెపోటు వచ్చినప్పుడు మత్తుపానియాలు తాగడం, సిగరెట్లు కాల్చడం పూర్తిగా మాని వెయ్యాలన్నాడు డాక్టర్. ఏ దుఃఖాన్ని మర్చిపోవటానికి బలహీనతలకు బానిసై అనారోగ్యాన్ని పెంచుకొన్నాడో, ఆరోగ్యం కోసం అదే బలహీనతలను వదులుకోవడం దుర్లభమని డాక్టర్‌కేం తెలుసు?

తనచుట్టూ వున్న ఈ పంజరం పగలాలి తను పక్షిలా స్వేచ్ఛగా,

ఆనందంగా ఎగిరిపోవాలి. అప్పుడే తన జీవితానికి విముక్తి. అదే తన దుఃఖానికి అవతలి ఒడ్డు.

ఒక్క గోపాలే కాదు - సెల్వీకూడా అదే మాటంది. తను నమ్మిన సిద్ధాంతాలు ఆదర్శాలనే రెక్కలు నరుక్కొని తాను పంజరంలో ఇరుక్కోబోతున్నాననీ, కళ్ళు మేఘంలా వర్షిస్తుంటే ఏడుస్తూ హెచ్చరించింది.

తను పంజరంలో చేరి తలుపులు మూసుకొన్నాడు.

కాలేజి చదివే రోజుల్లో యువరక్తం తనలో పరవళ్ళు తొక్కుతుంటే ఆదర్శాలు వల్లించేవాడు. పేదవాడి శ్రమబిందువులు జాతిరత్నాలుగా వెలుగొందాలని, కులమత వ్యవస్థలు శవాల్లా దహించబడాలని, స్త్రీజాతి కన్నీరు ఏరులా పొంగి, మగజాతి స్వార్థాన్ని ముంచెత్తాలని, అవినీతి అన్యాయాలకు సంకెళ్ళు తొడగాలని- పిడికిళ్ళు బిగించి ఉపన్యాసాలు దంచేవాడు.

యువత తనను మెచ్చింది. తన వ్యక్తిత్వాన్ని గౌరవిస్తూ, నాయకుడంటూ ఆకాశాని కెత్తింది. తనవెంట నడిచింది.

అప్పుడే రాజేంద్ర, సెల్వి పరిచయమయ్యారు. తనకు అండగా నిలబడ్డారు. త్వరలోనే తాము త్రివేణి సంగమంలా కలిసిపోయారు. ఎన్నో సంగతులు గంటలతరబడి చర్చించుకొంటూ కాలాన్ని మర్చిపోయేవాళ్ళు. తమ జీవితాలు ఆశయాలకు, ఆదర్శాలకు అంకితం కావాలని ప్రమాణాలు చేసుకొన్నారు.

మనిషి నల్లగావున్నా, తెల్లగా చంద్రబింబంలా మెరిసే సెల్వికళ్ళు తన హృదయంపై వెన్నెల కురిపించాయి. వసంత ఋతువులో కోయిల గానంలా ధ్వనించే ఆమె కరం తనకు మైమరపించింది. ఆమె విశాల హృదయం ఆసేతుహిమాచలం నుండి కన్యాకుమారి వరకు పరచుకొన్న ప్రకృతిలా తనను ముగ్ధుడ్ని కావించింది.

తనకు సెల్వి కావాలి. ఆమెలేని జీవితం చంద్రుడు లేని రేయిలాంటిది. కోయిల కూయని వసంతం లాంటిది. వర్షం కురియని మేఘంలాటిది.

తను ప్రేమిస్తున్నానని చెప్పినప్పుడు సెల్వి నదిలో ఇమిడిన సెలయేటిలా తనను కౌగిలించుకొంది. అధారాన్ని అల్లుకొన్న తీగలా పెనవేసుకొంది

"రాజా! కులాలు వేరైనా మన ఇద్దరి కలయిక, కులమత ద్వేషాల చీకటి ఆవరించుకొన్న ఈలోకానికి ఉషోదయం కావాలి. దేవాలయం లాంటి నీ హృదయంలో నాకింత చోటు దొరకడం నా అదృష్టం. ఈ కౌగిలి నాకు దూరం చెయ్యవు కదూ!" తన పెదాలతో సెల్వి పెదాలు మూసేశాడు.

ఈ విషయం రాజేంద్రకు చెప్పేసరికి ఎంతో సంతోషించాడు. "రాజా! ఆచరించగలిగే వ్యక్తియొక్క ఆదర్శమే

నిజమైన మార్గదర్శకత్వం. తనవెంట ఎందరినో నడిపించుకుపోగలశక్తి అప్పుడే ఆదర్శానికి లభిస్తుంది. ఆచరించనివ్యక్తి చెప్పే ఆదర్శం వంధ్య మైన పుష్పంలాంటిది. త్వరలోనే మీరు దంపతులు కావాలని మనసారా ఆశిస్తు న్నాను." తాము కాలేజి నుండి విడిపోయే ముందు రాజేంద్ర అన్న మాటలివి.

కాలేజీ చదువు ముగిసింది. జీవితానికో దారి ఏర్పడగానే సెల్వీని తన దాన్ని చేసుకోవాలి. మమతానుబంధాలతో తమ జీవితాలు పెనవేసుకోవాలి. ఎన్నో కలలు గంటుండేవాడు తను.

నిన్న మొన్నటివరకు తల్లిచాటున ఎదిగిన పక్షి ఆకాశంలోనికి ఎగరటం నేర్చింది. ప్రకృతిలో వసంతాలే కాదు శిశిరఋతువులూ వుంటాయని, హేమంత ఋతువులే కాదు గ్రీష్మఋతువులుంటా యని, వెన్నెలకాచే శరదృతువులే కాదు తుఫానులు వీచే వర్షఋతువులుంటాయని అర్థచేసుకొంది - అందుకు తనకో గూడు ముఖ్యం.


అప్పుడే - కౌసల్య బంగారు పంజ రంతో ఒంటరిగా తనకేసి చూస్తుంది. ఆమె చుట్టూవున్న ఐశ్వర్యం కొలిమిలా తన ఆదర్శాలను సమ్మెట దెబ్బలు వేసింది తన ఆదర్శాలు అనుభవాల వేడితే ఎర్రబారి ఆకృతి మారిపోయింది

తను కౌసల్యను పెళ్ళిచేసుకోబోతు న్నానని తెలిసి రాజేంద్ర, సెల్వీ వచ్చారు. సెల్వీ కుమిలి ఏడ్చింది. "రాజా! వ్యక్తి యొక్క ఔన్నత్యం చేదును కప్పిన తీపి తొడుగులాంటిది. నీతో జీవితాంతం చేదును మింగే దురదృష్టం నాకు తప్పించి నందుకు కృతజ్ఞురాలను నీ రెక్కలు నరుక్కొని ఒక బంగారు పంజరంలో ఇరుక్కోబోతున్నావు. వ్యాసార్ధాన్ని బట్టి పరిధి పెరుగుతుంది. కేంద్రాన్ని మించి ఎదగలేని నువ్వు విశాల ప్రపం చాన్ని చూడలేని కళ్ళున్న గుడ్డివాడివి వస్తాను." కన్నీళ్ళు చీరకొంగుతో అద్దు కొని రాజేంద్రతో వెళ్ళిపోయింది.

సిగరెట్ వేళ్ళమధ్య కాలేసరికి ఉలిక్కిపడి నేలమీదకు విసిరేశాడు. తిరిగి మరో సిగరెట్ వెలిగించాడు. వెంటనే కాల్చడం వలన వెగటనిపించి అయిదారు సార్లు పీల్చి అష్ట్రేలో పడేశాడు.

సిగరెట్ నుసిగా మారుతూ పొగ ముక్కుపుటాల్ని గాటుగా తాకుతుంటే చూస్తుండిపోయాడు. గాఢమైన పొగలా తిరిగి గతం మనసులో అల్లుకోసాగింది.

కౌసల్యతో పెళ్ళి జరిగి తను కలవా రింటి ఇల్లరికపు అల్లుడయ్యాడు. ఇంకా ఐశ్వర్యాన్ని పెంచి డబ్బుతో హోదా, పలుకుబడి సంపాదించాలని ఎన్నో వ్యాపారాలు ప్రారంభించాడు. సెల్వీ, రాజేంద్రలను ఒక విధంగా మర్చి పోయాడు. వారిని గురించి తెల్సుకోవా లన్న ఆలోచన ఏమాత్రం కలగలేదు.



స్వార్థం, అవినీతి, అన్యాయం, కులమత బేధాలు, పేదల శ్రమ పెట్టుబడులుగా వ్యాపారంచేసి లక్షలు గడించాడు తను. అందమైన బంగాళా, కార్లు, ఎన్నో కంపెనీల షేర్లు, లక్షల ఖరీదు చేసే స్థిరాస్తులతో తన పంజరానికి నగిషీలు చెక్కాడు.

ఇంతకాలం తాను బ్రతికింది పంజరమనే ఖైదులో.

జీవితమనే ప్రొద్దువాలి సూర్యాస్తమయం కాబోతుంది.

సూర్యోదయపు పక్షుల కిలకిల రావాలు, హిమబిందువులు ముత్యాల్లా మెరిపే వెన్నెల రాత్రుల ఆనందాన్ని ఆస్వాదించలేక జీవితంలో కృత్రిమత్వం పెంచుకొన్నాడు.

చుట్టూ అంధకారం, అశాంతి తప్ప తనేం మిగుల్చుకో గలిగాడు?

గదిలో అడుగుల చప్పుడు విని తలెత్తి చూశాడు.

ఎదురుగా నవ్వుతూ రాజేంద్ర.

రాజేంద్ర తన చుట్టూ పంజరం కట్టుకోలేదు. అతనికి రెక్కలున్నాయి. వాటికి ఎంత దూరమైనా ఎగరగలిగే శక్తి వుంది. తను పోగొట్టుకొన్నవన్నీ

అతను పొందగలిగాడు కనుక నే ప్వేచ్ఛగా నవ్వగలుగుతున్నాడు.

సంతోషంగా లేచి రాజేంద్రను కౌగిలించుకొన్నాడు. ఆ స్పర్శ లో అనిర్వచనీయానందాన్ని పొందాడు. ఎంతోకాలం తర్వాత కలుసుకొన్న ఆనందానికి ఇద్దరి కళ్ళూ అశ్రుపూరితా లయ్యాయి.

రాజేంద్ర చేయి పట్టుకొని నడిపించి సోఫాలో కూర్చోబెట్టాడు. తను ఎదు రుగా కూర్చున్నాడు.

"రాజేంద్రా! ఆరోగ్యం బావుంటే నేనే వచ్చి కల్సుకొనేవాణ్ని. నా కోరిక మన్నించి చూడటానికి వస్తావని పూహించలేదు. నామీద ఇంకా కోపం పోలేదనుకొన్నాను."

"కోపం ఎందుకు!" నవ్వేడు.

"రాజేంద్రా! ఇరుప్రక్కలా ఒకేలా వుంటే అద్దంలో ప్రతిబింబం ఎవరూ చూడా లనుకోరు. హృదయం దృశ్యాన్ని ప్రతిబింబించని అద్దంలాంటిది." నిట్టూ ర్చాడు రాజారావు.

"గతం నువ్వు ఇంకా మర్చిపోలేదా!"

"అది నా జీవితానికి ఎక్కుబెట్టిన వేటగాడి బాణం లాంటిది. సెల్వికి నేను చేసిన అన్యాయం క్షమించరానిది."

రాజేంద్ర మౌనంగా వుండిపోయాడు. రాజారావు రెండు గ్లాసుల్లో విస్కీ కలిపి అందించాడు. అభ్యంతరం చెప్పకుండా కొంచెంగా సిప్ చేస్తున్నాడు రాజేంద్ర.

"నీ ఆరోగ్యం బావుండలేదా!" ప్రశ్నించాడు.

"వాడే మొక్కకు, చిగురించే మొక్కకు తేడా వుండదంటావా? నేను ఎండిన మోడును." పేలవంగా నవ్వేడు.

"క్రిందటి వారం పేపర్లో నువ్వు రాష్ట్రపతి నుండి అవార్డు స్వీకరిస్తున్న ఫోటో చూసి వుండకపోతే నీ గురించి తెలుసుకోలేకపోయేవాడ్ని. యుద్ధంలో నువ్వు ప్రదర్శించిన ధైర్యసాహసా లకు నువ్వు ప్రశంసించబడటం నాకెంతో ఆనందం కలిగించింది. నా కళ్ళు చెమ్మ గిల్లాయి. ఎందుకో తెలుసా? నా మిత్రుడు నాలా పంజరంలో బంధించ బడలేదని."

"రాజా! ఏ రెండు జాతి పక్షులెప్పుడూ ఒకేలా కూయవు. దేని గొంతు దానిది. మనిద్దరం ఎవరి కిష్టమైన మార్గాల్లో వాళ్ళు ప్రయాణించాం. నీ జీవితానికి కిప్పుడేం తక్కువైంది."

"నాకేం మిగిలిందని తక్కువైందని ప్రశ్నించుకోను? మిగిలిందల్లా చీకటేగా!" బాధగా అన్నాడు.

మిగిలిన విస్కీ ఒక్క గుక్కలో తాగాడు. కొద్ది క్షణాల తర్వాత, "ఒక్కడివే వచ్చావేం? భార్యను తీసుకు రాలేదేం? పిల్లలెంతమంది?" అడిగాడు రాజారావు.

ఒక నిమిషం రాజేంద్ర సమాధానం చెప్పలేదు. ఖాళీ గ్లాసు టీపాయి మీద

పెడ్తూ, "నేను సెల్విని పెళ్ళిచేసుకొన్న సంగతి నీకు తెలియదు కదూ! ఒక ఆడపిల్ల పుట్టింది." అన్నాడు.

రాజారావు కొంచెం తుళ్ళిపడ్డాడు. అప్రయత్నంగా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. పెదాలు వణుకుతున్నాయి. కొద్ది నిమిషాలు గొంతు పెగల్లేదు.

"రాజేంద్రా! మనిద్దరం రెండు ధృవాలం. అదర్శమార్గంలో నీ జీవితం హుందాగా నడిస్తే, ప్రక్కదారిలో నా జీవితం ఆ-దర్శాన్ని తప్పుకు తిరిగింది. యుద్ధంలో చేరి దేశానికి నిన్ను అంకితం చేసుకొన్నావు. నువ్వానాడు అన్నట్లుగా నేను నిజంగా వంధ్య పుష్పంలాంటి వాడ్నే. సెల్విని కూడా తీసుకొస్తే సంతోషించేవాడ్ని." కళ్ళు తుడుచుకొన్నాడు.

"తను రాలేనంది. అందుకే ఒక్కడ్నే వచ్చాను." జాలిగా చూస్తూ అన్నాడు.

"నాలాంటి పాపిని ఎవడు మాత్రం చూడాలనుకొంటార్లే. వస్తే క్షమాభిక్ష వేడుకొనేవాడ్ని."

"రాజా! గతాన్ని సెల్వి ఎప్పుడో మర్చిపోయింది. నీమీద తనకే మాత్రం కోపంలేదు. ఆరోగ్యం సరిగాలేదు." సిగరెట్ వెలిగించాడు.

రాజారావు తనూ వెలిగించుకున్నాడు. కొద్ది నిముషాలు అలానే మౌనంగా వుండిపోయారిద్దరూ.

"కౌసల్య కనిపించదేం? పిల్లలెంత మంది?" అడిగాడు రాజేంద్ర.

కుర్చీలో భారంగా వెనక్కు వాలి కళ్ళు మూసుకొన్నాడు రాజారావు. "కౌసల్య చచ్చిపోయి రెండేళ్ళు దాటింది. నా పంజరంనుండి ఒంటరిగా, స్వేచ్ఛగా ఎగిరిపోయింది." కంఠం పూడుకుపోయింది.

తిరిగి చెప్పసాగేడు. "స్పర్శకు ముడుచుకొని కుచించుకుపోయే అత్తి మొక్కలా, అదర్శపు ఉనికి జీవితంలో నా విశాలత్వాన్ని కుదింపజేసింది. ఏమాత్రం చిన్నగాలి సోకినా తల నేల వాల్చే గడ్డిపోచలా బ్రతికాను.

"చెప్పినదాన్ని ఏమాత్రం ఆచరించలేని పిరికివాడ్ని నేను. చెప్పకపోయినా ఆచరించి చూపించగలిగే ధైర్యస్థుడివి నువ్వు. నువ్వు దేశానికి కవచానివైతే నేను దేశానికి చెదపురుగులాంటివాడ్ని. పెద్దరికపు తొడుగును కప్పుకొన్న అంతఃశత్రువును నేను. నీ తుపాకి నా గుండెకు ఒక్కసారి గురిపెట్టినా సమాజానికి చాలా మేలు జరిగేది.

"చెప్పేవాడెప్పుడూ చేసేవాడు కాదన్న యదార్థానికి ఉదాహరణే నేను. ప్రమానును బట్టి చెట్టు యెదగాలి లేకుంటే ఎదిగి విరిగిపడ్తుందన్న సత్యం నా జీవితంలో నిజమైంది. ఈ సమాజం నీ ఔన్నత్యానికి శిరస్సు వంచి గౌరవిస్తే, అదే

సమాజం ముందు నేను తలవాల్చుకోవాల్సినవాడ్ని.

"గాలివీచే దిశను బట్టి ఎగిరే వ్యక్తిని నేను. దేశంలో కుళ్ళును పెంచే నేను ఏ న్యాయస్థానం ముందు దోషిగా నిలబెట్టబడి శిక్షించబడలేదు. నా పంజరపు వన్నెకు అంతా మోసపోయారు. కాని అంతరాత్మ విధించిన శిక్షమాత్రం తప్పించుకోలేకపోయాను.

"మనిషిలో పెరిగే ప్రలోభాలు, వ్యామోహాలు, బలహీనతలు పూచల్లా పంజరాన్ని తన చుట్టూ బిగిస్తాయి. వాటిపై అద్దబడిన తళుకు వాస్తవాన్ని కప్పిపెడ్తుంది. అదే ప్రపంచమనుకొనే సంకుచితవర్గం నానాటికి పెరిగి తమ చుట్టూ పంజరాలు నిర్మించుకొంటుంది. అవి సమాజంలో ప్రమాదకరమైన పులి బోనుల్లాంటివి.

"తన ఊహలకు, ఉద్దేశాలకు, ఆశయాలకు అనుగుణంగా స్వేచ్ఛగా ఎగరాలనుకొన్నాడు నా కొడుకు. వాడి రెక్కలను త్రెంచి వాడిని నా పంజరంలో ఇరికించాలనుకొన్నాను. నేను నడిచిన తప్పు మార్గాన్నే వాడ్ని నడిపించాలనుకొన్నాను. అందుకోసం వల విసిరాను."

"హ! .." బాధగా గాలి వదిలాడు.

"పక్షి ఎగిరిపోయింది రాజేంద్రా! శూన్యాన్ని వెతుక్కొంటూ పంజరాలు లేని ప్రపంచాని కది ఎగిరిపోయింది. నాకున్న ఒక్కగా నొక్క కొడుకును బలితీసుకొన్నాను." ఆవేదన గుండెను పిండిచేస్తుంటే మాటలు రాక మౌనంగా వుండిపోయాడు. కళ్ళు వర్షిస్తున్నాయి. అతను కట్టుకొన్న బంగారు పంజరపు పూచల్ని కదిలిస్తుంటే కుమిలిపోతున్నాడు

"గోపాల్ చనిపోయాడన్న దిగుల్తో కౌసల్య మంచంపట్టి చచ్చిపోయింది. చివరకు నేను నా పంజరంలో ఒంటరిగా మిగిలిపోయాను. నాకున్న అంతులేని సంపద నాకేమాత్రం తృప్తినివ్వలేకపోయింది." ఆయాసంతో వూపిరి పీల్చుకోవటానికి ఆగాడు. రాజేంద్ర టీపాయి మీదున్న అల్బమ్ తీసుకొని పేజీలు తిప్పసాగేడు.

"అది గోపాల్ అల్బమ్. తన జ్ఞాపకార్థం వాడు నాకు దాన్ని మిగిల్చిపోయాడు. నా మూర్ఖత్వం వాడ్ని బలి తీసుకొనకుంటే ఈ శేషజీవితంలో నాకు ఒంటరితనం మిగిలేది కాదు. జీవితమంతా ఎండమావులకోసం పరిగెత్తి అలసిపోయాను." తిరిగి కుర్చీలో వెనక్కు వాలి కళ్ళుమూసుకొన్నాడు.

తిరిగి ప్రారంభించాడు. "మనసు విప్పి బాధను చెప్పుకోవటానికైనా నా వారెవరూ లేరని విచారిస్తుంటే నీ గురించే తెలిసింది. నీ అడ్రసు సంపాదించి వెంటనే ఉత్తరం వ్రాశాను. ఒకందుకు నాకు సంతోషంగా వుంది. జీవితంలో నేను పోగొట్టుకున్నవన్నీ

నీవు మిగుల్చుకోగలిగావు. నీ విశాల హృదయం, ఔన్నత్యం నీకు ఉత్తమ జీవితాన్ని ప్రసాదించింది. నువ్వు చాలా అదృష్టవంతుడివి. భార్యా, బిడ్డలతో ఆనందంగా శేషజీవితాన్ని గడప గలుగుతున్నావు అందుకు నేను అసూయ పడటంలేదు అభినందిస్తు న్నాను," ముందుకు వంగాడు.

ఆల్బమ్ చూస్తున్న రాజేంద్ర దృష్టి చివరిపేజీలో నిశ్చలంగా నిల్చిపోయింది. నిర్మలమైన కళ్ళలో అమాయకంగా చూసే ఫోటోలోని యువతి చూపు అతని గుండెను తాకింది. ఆ ఫోటో క్రింద వ్రాసిఉన్న వాక్యాలు పదే పదే చదివాడు.

"ప్రియా! సమాజం కట్టే పంజరంలో మనం ఖైదీలుగా బ్రతకలేం. స్వేచ్ఛగా పక్షిలా బ్రతకడం నాకు చేతకాదు. అందుకే - పంజరాల్లేని చోటుకు కలసి ఎగిరిపోదాం. నాతో రా .మన త్యాగం గుర్తించైనా ఈ సమాజం రాబోయే తరాలకు పంజరాలు నిర్మించదు.

గోపాల్."

రాజేంద్ర ఆ వాక్యాలు పైకి చదివి ఉద్వేగంతో తలెత్తి రాజారావు ముఖం లోకి చూశాడు.

తనతోపాటు కాలేజీలో చదివే ఆ అమ్మాయినే గోపాల్ ప్రేమించాడు. కులంలేదని, ఆస్తిలేదని వలవిసిరి వాళ్ళ ఇద్దర్నీ విడదీయాలనుకున్నాను. వారి పవిత్ర ప్రేమకు సమాధికట్టా లను కొన్నాను. నేను సెల్వికి చేసిన మోసాన్ని వాడు చెయ్యలేక ఆత్మహత్య చేసు కొన్నాడు .... రాజేంద్రా! అమ్మాయికి పెళ్ళిచేశావా? స్వేచ్ఛా, స్వాతంత్ర్యా లకు సంకెళ్ళువేసే సంకుచిత మనస్తత్వం నీకు లేదు గనుక నీ కూతురి జీవితం సుఖంగా గడుస్తుందని ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను," రాజేంద్ర కేసి ప్రశంసాపూర్వకంగా చూస్తూ అన్నాడు.

రాజేంద్ర ఒక నిమిషం మౌనంగా ఉండిపోయాడు. చూస్తున్న ఆల్బమ్ మూసి టీపాయిమీద పెట్టాడు. సిగరెట్ తీసి, వెలిగించుకొని చెప్పటం ప్రారం భించాడు.

"రాజా! కులమత భేదాలు, ఈర్ష్యా ద్వేషాలు, స్వార్ధం ఏమాత్రం తెలియని రెండు పక్షులు నేస్తం కట్టాయి. వాటికి అందమైన పూలతోటలు, మైదానాలు విశాలమైన నీలిఆకాశం, సెలయేటి గల గలలు మాత్రమే తెలుసు.

ఆ రెండు పక్షులు జీవితాంతం జంటగా కలసి ఎగరాలనుకొన్నాయి. తమ జంటగొంతులు మేళవించి మధుర గానంతో ఈ లోకాన్ని పులకింపజెయ్యా లనుకొన్నాయి.

"అయితే విధి వక్రించింది. ఒక వేటగాడి కన్ను ఆ జంటపై పడింది. ఆ మగ పక్షిని పట్టి రెక్కలు విరిచి పంజరంలో పెట్టి అమ్మటూపాలను

కొన్నాడు. అమాయకమైన మగపక్షి వేటగాడి చేతిలో ఒంటరిగా చిక్కింది. ప్రియురాలికి దూరమై వేటగాడి చేతిలో పెంపుడుపక్షిలా బ్రతకడం సహించలేక పోయింది

రాజారావు మెదడు చురుగ్గా పని చేస్తుంది. చెమటలు పట్టి గుండెవేగం హెచ్చింది. శరీరంలో వణుకు ప్రారంభమైంది. గత స్మృతులు మేఘల్లా కమ్ముకోసాగాయి.

రాజేంద్ర తిరిగి, "వింటున్నావా రాజా?" అని అడిగేసరికి రాజారావు ఉలిక్కిపడి మౌనంగా తలూపాడు.

"మగపక్షి జాడ తెలియక ఆడపక్షి విలవిలలాడింది. ప్రకృతి స్పందించేలా తన గొంతువిప్పి, "ప్రియా, ప్రియా" అంటూ హృదయవిదారకంగా ఏడ్చింది. ఆ విషాదగానానికి చెట్లు, పుట్టలు కన్నీరు కార్చాయి. తూడు, నీళ్ళు ముట్టకుండా తన నేస్తం జాడకోసం చెట్టులు, గుట్టలు సెలయేటిగట్టులు వెతుకుతూ ఎగిరెగిరి ఆకాశపు అంచులు దాటింది. చివరకు ప్రాణంలేని తన ప్రియనేస్తం నిర్జీవ శరీరాన్ని కనుగొంది.

"విషాదంగా పాడుతూ ఆకాశంలోకి ఎగిరింది. ఆ విషాద తీవ్రతకు దిక్కులు పిక్కటిల్లాయి. లోయలు ప్రతిధ్వనించాయి. శిఖరాలు సానుభూతితో మంచును కన్నీటిలా ప్రవహింపజేశాయి. ఆ పక్షి గానానికి గాలి స్తంభించింది. ప్రియా.... ప్రియా... ఆమె గొంతు చివరకు మూగపోయింది.

"ఉదయం సూర్యోదయ కిరణాల స్పర్శలో మేల్కొని కిలకిల రావాలు చేసే ఆ పక్షిగూటినుండి ఏ శబ్దం వినిపించలేదు. గూడు గాలికి చెదిరి చివరికి నేలకూలింది. తన ప్రియుని చేరుకోవాలన్న ఆవేదనతో చివరకు ఆ పక్షి ఆత్మహత్య చేసుకొంది." ముగించిన రాజేంద్ర కళ్ళలో నీరు సుడులు తిరిగింది. రాజారావు షాక్ తిన్నాడు. ఆ కథ అతని పంజరాన్ని కదిలించింది. బలంగా చేతుల్ని ఛాతిపై అణచుకొంటూ, "రాజేంద్రా! పంజరం పగిలిపో... ఆ అమ్మాయి....నీకు...." మాట్లాడలేక కుర్చీలో వెనక్కివాలి పోయాడు.

